సాక్షి ఒడిశా

మంగళవారం । 3 । జనవరి । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,88,573లు, బంగారం 5.5 గ్రాములు, వెండి 27.4 గ్రాములు ఉన్నాయని అధికారులు వెల్లడించారు.



మోక్షప్రదం.. వైకుంఠ ద్వార దర్శనం

- 8లో



భక్తిశ్రద్ధలతో పూజలు

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలోని పాత్రొగూడ లోని షిర్డీసాయి మందిర 12వ వార్షికోత్సవాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు కలశయాత్ర నిర్వహించారు.

న్యూస్‌రీల్

ఎంపీ ప్రతాప్ చంద్రకు అస్వస్థత



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎంపీ ప్రతాప్‌చంద్ర షడంగి

భువనేశ్వర్: బాలాసోర్ పార్లమెంట్ సభ్యుడు, కేంద్ర మాజీమంత్రి ప్రతాప్ చంద్ర షడంగి అస్వస్థతకు గురయ్యారు. ఛాతి నొప్పి తీవ్రం కావడంతో ఆయన ఆస్పత్రిలో చేర్చారు. గత 3 రోజులుగా జలుబు, జ్వరంతో బాధపడుతుండగా, ఆరోగ్యం క్షీణించడంతో బాలాసోర్ లోని ఫకీర్ మోహన్ వైద్య కళాశాల ఆస్పత్రిలో చేర్చారు. ఐసీయూలో చికిత్స కొనసాగుతుందని వైద్య వర్గాలు తెలిపాయి. న్యూమోనియా సోకినట్లు భావిస్తున్నారు.

కొరాపుట్ ఎస్పీగా అభినవ్ శుంకర్



అభినవ్ శుంకర్‌కు బాధ్యతలు అప్పగిస్తున్న ఎస్పీ వరుణ్

కొరాపుట్: జిల్లా పోలీస్ నూతన సూపరింటెండెంట్‌గా అభినవ శుంకర్ బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ప్రస్తుత ఎస్పీ వరుణ్ గుంటువల్లి నుంచి బాధ్యతలు అప్పగించారు. అభినవ్ కలహండి జిల్లా కెసింగాలో ఎస్‌డీపీఓగా పని చేస్తూ విశ్రాంత ఉన్నతిపై కొరాపుట్ ఎస్పీగా వచ్చారు. అలాగే వరుణ్ భద్రక్ జిల్లా ఎస్పీగా బదలీ అయ్యారు. ఈనెల 4న భద్రక్ లో బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుత ఎస్పీ కొరాపుట్ జిల్లాలో గనుల తవ్వకాలపై జరిగిన వ్యతిరేక ఉద్యమాలు. భారతమాల ప్రాజెక్టు నిర్మాణం, మావోయిస్టుల సమస్య తరచూ దిగ్భ్రాంతికి గురయ్యే సుంకి ఘట్ రోడ్డు, రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రధాన అంశాలుగా ఉన్నాయి.

కలెక్టర్ గ్రీవెన్స్‌కు స్పందన



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ లింగరాజ్

పర్లాకిమిడి: జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో గ్రీవెన్సు సెల్, గ్రామముఖి పరిపాలన కార్యక్రమాన్ని జిల్లా యంత్రాంగం సోమవారం నిర్వహించారు. ఇందులో కలెక్టర్ లింగరాజ్ పండా, ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, జిల్లా అదనపు మేజిస్ట్రేట్ సంగ్రాశేఖర పండా, డీఎస్పీ రాజకిశోర్ దాస్ హాజరయ్యారు. పర్లాకిమిడి మున్సిపాలిటీ, రాణిపేట, కెరండి, కత్తలకవిటి, సిద్ధమనుగు పంచాయతీల నుంచి మొత్తం 103 వినతులు అందగా, ఇందులో వ్యక్తిగతం 97, పంచాయతీలకు సంబంధించినవి 6 సమస్యలుగా గుర్తించారు. వీటిలో 51 వినతులకు అధికారులు అక్కడికక్కడే పరిష్కరం చూపారు. రేషన్ కార్డులు, గృహ నిర్మాణాలు, ఉపాధి, విద్య, రోడ్లు, సాగునీటి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ పీడీ ఫల్గుణీ మాఝి, డిప్యూటీ కలెక్టర్ నట్వర గొరోజ్, గ్రీవెన్స్ సెల్ నోడల్ అధికారి నర్మదా నాయక్, అధికారులు పాల్గొన్నారు.

కదం తొక్కిన మహిళలు



నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

రాయగడ: జిల్లాలోని అంబోదళ పాయికో వీధి మహిళలు నిరసన గళం వినిపించారు. అంతా ఏకమై తమ వీధిలో కొనసాగుతున్న మద్యం, సారా విక్రయాల దుకాణాలను తొలగించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆందోళన చేపట్టారు. మద్యం విక్రయాలతో తామంతా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు అంతా కలిసి, సారా విక్రయ కేంద్రాలకు చెందిన యజమానులను హెచ్చరించారు. మద్యం, సారా దుకాణాలను తొలగించాలని పలు మార్లు సంబంధిత యజమానులను కోరినప్పటికీ వారు స్పందించక పోవడంతో ఆందోళన చేపట్టామని మహిళలు వివరించారు.



ప్రారంభ గీతాన్ని ఆలపిస్తున్న అతిథులు



వేదికపై ప్రసంగిస్తున్న ఎస్‌ఎస్‌డీసీ సీఎస్ సుబ్రతో బాగ్చి

పరిశోధనలతో ప్రత్యేక గుర్తింపు

- అగ్ర రాజ్యాలను ఎదుర్కోవాలంటే మెరుగైన పోటీ తప్పదు
- రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ ముఖ్య కార్యదర్శి సుబ్రతో బాగ్చి
- ఘనంగా బరంపురం విశ్వ విద్యాలయం 57వ వ్యవస్థాపకోత్సవం
- త్వరలో మరిన్ని కోర్సులు: వీసీ గీతాంజలి దాస్

బరంపురం: నేటి గ్లోబలైజేషన్ యుగంలో అగ్ర దేశాలతో సమానంగా అన్ని రంగాల్లో రాణించాలని రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ ముఖ్య కార్యదర్శి డాక్టర్ సుబ్రతో బాగ్చి అన్నారు. విద్యార్థులు ఉత్తమ పరిశోధనలు, నాణ్యమైన విద్యను ఆకలింపు చేసుకొని ధీటైన పోటీ ఇవ్వాలని ఆకాంక్షించారు. విశ్వ విద్యాలయాల్లో నూతన ఆలోచనలతో ఆధునిక పరిశోధనలు చేపట్టి, విజయాలు సాధించాలని సూచిస్తూ యువతలో నూతనోత్సాహాన్ని నింపారు. బరంపురం విశ్వ విద్యాలయం 57వ వ్యవస్థాపక దినోత్సవాలను నగరంలోని బంజవిహార్ ప్రాంగణంలో ఉన్న బిజూ పట్నాయక్ ఆడిటోరియంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. వర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ గీతాంజలి దాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమనికి ఆయన అతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలనతో ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ తాను కూడా ఇదే విశ్వ విద్యాలయంలో ఉన్నత విద్యాభాసం పూర్తి చేసి, ఉన్నత శిఖరాలు అధిరోహించానని తెలిపారు. ప్రస్తుత విద్యార్థినీ, విద్యార్థుల్లో పోటీతత్వం ఉండాలని, అందరిలా కాకుండా ఉత్తమ అలోచనలతో తమకంటూ భిన్నమైన లక్ష్యాన్ని ఏర్పరుచుకొని, సాధన దిశగా అడుగులు వేయాలని పేర్కొన్నారు. క్రమ శిక్షణతో బంగారు భవితకు బాటలు వేసుకోవాలన్నారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా 100 విశ్వ విద్యాలయాల్లో విపరీతమైన పోటీ ఉందని, అందులో బరంపురం వర్సిటీ కూడా ఒకటిగా నిలిచిందని అభిప్రాయం వ్యక్తంచేశారు. వర్సిటీ వీసీ ప్రొఫెసర్ గీతాంజలి దాస్ మాట్లాడుతూ 1967లో బరంపురం విశ్వ విద్యాలయాన్ని స్థాపించారని, గత 57 ఏళ్లలో వేలాది మంది విద్యార్థులు చదువులు పూర్తి చేసి, దేశాభివృద్ధిలో భాగమయ్యేలా కీలక పాత్ర పోషించిందని తెలిపారు. ప్రస్తుతం విశ్వ విద్యాలయం పరిధిలో 181 కళాశాలలు ఉన్నాయని, ఇందులో 109 డిగ్రీ కళాశాలలు ఉన్నాయన్నారు. త్వరలో విద్యార్థులకు మరిన్ని కొత్త కోర్సులు ప్రవేశ పెట్టనున్నట్లు వివరించారు.



వర్సిటీ వ్యవస్థాపకోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు, ప్రొఫెసర్లు, విద్యార్థులు

జాతీయ అవార్డులు..

బరంపురం విశ్వ విద్యాలయం 57వ వ్యవస్థాపక దినోత్సవాల్లో భాగంగా స్కిల్ డెవలప్‌మెంట్ ముఖ్య కార్యదర్శి సుబ్రతో బాగ్చి, వీసీ గీతాంజలి దాస్ చేతుల మీదుగా ఇరువురు ప్రముఖులకు కవి సామ్రాట్ ఉపేంద్ర బంజా జాతీయ అవార్డును ప్రదానం చేశారు. ప్రముఖ ఆదివాసీ కవయిత్రి, పద్మశ్రీ అవార్డు గ్రహీత పూర్ణమాసి జానీ, ప్రముఖ కవి జయంత్ మహాపాత్రొ ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారికి అవార్డు అందజేసి, యూనివర్సిటీ తరఫున దుస్సాలువతో సత్కరించారు. అలాగే వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు పతకాలు, ధ్రువ పత్రాలు అందజేశారు. కార్యక్రమలో వర్సిటీ పీజీ కౌన్సిల్ చైర్మన్, రిజిస్ట్రార్, ప్రొఫెసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



కవయిత్రి పూర్ణమాసి జానీకి కవి సామ్రాట్ ఉపేంద్ర బంజా అవార్డును అందిస్తున్న సుబ్రతో బాగ్చి, వీసీ దాస్

అధికారి బదిలీ కోరుతూ ఆందోళన

- మున్సిపల్ చైర్మన్‌ను డీఆర్‌డీఏ పీడీ అడ్డుకోవడంతో వివాదం



డీఆర్‌డీఏ కార్యాలయానికి తాళాలు వేసిన ఆందోళనకారులు

కొరాపుట్: నవరంగ్‌పూర్ జిల్లా సమగ్ర గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్‌ను బదిలీ చేయాలని కోరుతూ బీజేపీ నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని డీఆర్‌డీఏ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన శిబిరం నిర్వహించారు. ఓ ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ కును నాయక్‌ను డీఆర్‌డీఏ పీడీ అన్య దాస్ నువ్వెవరంటూ ప్రశ్నించారు. దీంతో వివాదం రాజుకుంది. తమ పార్టీకి చెందిన చైర్మన్‌ను అధికారి అవమాన పరిచారని, తక్షణమే ఆమెను బదిలీ చేయాలని కోరుతూ రోడ్డుపై బైఠాయించారు. టైర్లకు నిప్పంటించి, నినాదాలు చేశారు. అంతకుముందు డీఆర్‌డీఏ కార్యాలయానికి తాళాలు వేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, బీజేపీ నాయకులను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీనిపై కును నాయక్ మాట్లాడుతూ.. ప్రభుత్వం తరఫున ఆహ్వానించిన ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వేదిక పైకి వెళ్తున్న తనను పీడీ ఉద్దేశ పూర్వకంగా నెవ్వవరంటూ అడ్డుకున్నారని, సీటు లోంచి లేవాలని అవమానకరంగా ప్రవర్తించారని తెలిపారు. ఆందోళనలో పార్టీ సీనియర్ నాయకుడు గౌరీ మాఝి, శుభం చౌదరి, షర్మిష్టా దేవ్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై టైర్లకు నిప్పంటించి, ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

జయపురం మహారాణి ఇక లేరు

- నివాళులర్పించిన రాజకీయ, పట్టణ ప్రముఖులు



మహారాణి అంతిమ దర్శనానికి చేరుకున్న రాజకీయ, పట్టణ ప్రముఖులు

జయపురం: మహారాణి రమాకుమారి దేవి(92) వృద్ధాప్య అనారోగ్య కారణాలతో సోమవారం పరమపదించారు. ఆమె జయపురం ఆఖరి మహారాజు రామకృష్ణ దేవ్ పట్టపురాణి. సాహిత్య సామ్రాట్ విక్రమదేవ్ వర్మకు కోడలు. రామకృష్ణ దేవ్ వృద్ధాప్య ఛాయలతో కొన్నేళ్ల క్రితం మరణించిన విషయం తెలిసిందే. రమాకుమారి దేవి ఆంధ్రప్రదేశ్‌లోని మాడుగుల శాసనసభ నియోజకవర్గం నుంచి 1975లో ఎమ్మెల్యేగా పోటీచేసి, గెలుపొందారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం కాగా, ముగ్గురూ ఇదివరకే మృతిచెందారు. ఇద్దరు యువరాణిలు(కోడల్లు), మనుమడు విశ్వేశ్వర చంద్రచూడ్ దేవ్, మనుమరాలు ఉన్నారు. మహారాణి మరణ సమయంలో కోటలోనే ఉన్న చంద్రచూడ్, రాజ కుటుంబీకులు తుది సేవలందించారు. మరణ వార్త తెలుసుకున్న జయపురం ప్రజలు శోకసంద్రంలో మునిగిపోయారు. సాయంత్ర జరిపిన అంతిమ యాత్రలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, పట్టణ ప్రముఖులు, ప్రజలు భారీగా తరలివచ్చి, పాల్గొన్నారు. జయపురంలోని రాజుల ప్రత్యేక శ్మశాన వాటికలో అంతిమ సంస్కారాలు రాజ లాంఛనాలతో చేపట్టారు. మహారాణి రమాకుమారి దేవి మృతికి జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహినీపతి తీవ్ర సంతాపాన్ని ప్రకటించారు. ఆఖరి రాజైన మహారాజ రామకృష్ణ దేవ్ పట్టపురాణి రమాకుమారి దేవి భహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు. ఆమె ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.



మహారాణి రమాకుమారి దేవి(ఫైల్ ఫొటో)



విషణ్ణ వదనంలో యువరాజు చంద్రచూడ్ దేవ్, అతని తల్లి

నాలుగు వారాల్లో నివేదిక ఇవ్వండి

- జిల్లా ఎస్పీకి ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఆదేశాలు

రాయగడ: రష్యాకు చెందిన ఎంపీ యాంథోవ్ పావెల్, అతని స్నేహితుడు వ్లాదిమర్ బిదానోవ్ అనుమానాస్పద మృతులపై సమగ్ర నివేదికను నాలుగు వారాల్లో సమర్పించాలని జిల్లా ఎస్పీ వివేకానంద శర్మకు జాతీయ మానవ హక్కుల కమిషన్(ఎన్‌హెచ్‌ఆర్‌సీ) ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసుకు సంబంధించి చొరవ తీసుకున్న కమిషన్.. వాస్తవ పరిస్థితి, ఇప్పటి వరకు చేపట్టిన దర్యాప్తు తదితర అంశాలపై వివరాలను కోరింది. ఇదిలా ఉండగా గత 4 రోజులుగా దర్యాప్తు చేస్తున్న క్రైం బ్రాంచ్ అధికారులు ఐదో రోజు కూడా తన దర్యాప్తును కొనసాగించారు. ఈ క్రమంలో హోటల్ యజమాని అరవింద సాహు, సిబ్బందిని క్రైం బ్రాంచ్ డీఎస్పీ సరోజ్‌కాంత్ మహంత, ఇన్‌స్పెక్టర్ మమతారాణి పండా వేర్వేరుగా విచారించారు. సిరిగుడ శ్మశానవాటిక నుంచి శనివారం సంగ్రహించిన మృతుల అవశేషాలను భువనేశ్వర్ లోని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించగా, వ్లాదిమర్ మరణించిన సమయంలో గంజాయి సేవించినట్లు గుర్తించారు. అయితే స్థానికుడు కాని అతనికి గంజాయి చేరవేసింది ఎవరనే విషయంపై క్రైం బ్రాంచ్ అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మరోవైపు పూర్తిస్థాయి దర్యాప్తులో భాగంగా ఇంటర్‌పోల్ సహకారాన్ని తీసుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు.



హోటల్ సిబ్బందిని విచారిస్తున్న క్రైం బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ పండా

వైద్య కళాశాలల్లో బోధనాస్పత్రులు

భువనేశ్వర్: ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించే దిశలో ప్రభుత్వం సరికొత్త ప్రయోగాలతో ముందుకు సాగుతోంది. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వ వైద్య కళాశాలల్లో త్వరలో బోధన ఆస్పపత్రులు(టీచింగ్ హాస్పిటళ్లు) ప్రారంభం కానున్నాయి. రాష్ట్రంలోని 9 ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఈ మేరకు సన్నాహాలు చురుగ్గా సాగుతున్నాయి. తొలి దశలో కెంఝొహర్ కళాశాలలో, అనంతరం బాలసోర్, బొలంగిర్, జాజ్‌పూర్, పూరీ, కొరాపుట్, ఫుల్బాణి, భవానీపట్న ఈ సదుపాయాన్ని ప్రారంభించనున్నారు. ఈ నెలాఖరులోగా ఈ పనులు పూర్తి చేయాలని నిర్దేశించారు. జూన్ నాటికి బాలసోర్, బొలంగిర్ పనులు కానున్నాయి. జూలైలో జాజ్‌పూర్, పూరీ, ఆగస్టు నాటికి కొరాపుట్, ఈ ఏడాది చివరి నాటికి ఫుల్బాణి, భవానీపట్న ప్రాంతాల్లో బోధన ఆస్పత్రులు ప్రారంభించనున్నారు. దీనికి అనుగుణంగా ఆస్పత్రి నిర్వహణకు అవసరమైన పరికరాలు, ఇతర సరంజామా నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేసేందుకు రాష్ట్రప్రభుత్వం బ్రాడ్ స్పెషాలిటీ విభాగాల్లో 274మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించాలని ఆరోగ్యశాఖ గతంలో నిర్ణయించింది.

ఉపాధ్యాయుడిని నరికి చంపిన అటెండర్

- మృతదేహంతో బాధితుల ఆందోళన



మృతదేహంతో ధర్నా చేస్తున్న కుటుంబ సభ్యులు



నిందితుడు నరేష్ క్షతియా

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలోని సరస్వతీ శిశుమందిర్ పాఠశాల ఉపాధ్యాయుడు నిరాకర్ శెఠి(45)ని అదే పాఠశాలలో అటెండర్‌గా పని చేస్తున్న నరేష్ క్షతియా గొడ్డలితో నరికి హత్య చేశాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు మృతదేహంతో సహా పాఠశాల ఎదుట బైఠాయించి, నిరసనకు దిగారు. పోలీసులు కలుగజేసుకోవడంతో వారు ధర్నా విరమించారు. వివరాల్లోకి వెళ్తే... గత కొద్ది రోజులుగా ఉపాధ్యాయుడు నరేష్‌తో అటెండర్ నిరాకర్‌కు మధ్యా గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా సిబ్బంది, విద్యార్థులు పాఠశాలకు చేరుకొని, ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపి, తిరిగి ఇళ్లకు వెళ్లిపోయారు. అయితే అప్పటి వరకు చుట్టుపక్కల మాటు వేసిన నరేష్.. మధ్యాహ్నం 12 గంటల సమయంలో పాఠశాలలోకి ప్రవేశించాడు. తనతో వెంట తెచ్చుకున్న గొడ్డలితో నిరాకర్ మెడపై బలంగా వేటు వేశాడు. దీంతో ఆయన పెద్ద కేకలు వేయడంతో తోటి ఉపాధ్యాయులు అక్కడికి చేరుకొని మల్కన్‌గిరి పోలీసులకు సమాచారం అందించారు. ఐఐసీ రీగాన్ కీండో తన సిబ్బందితో అక్కడికి చేరుకొని, కొన ఊపిరితో ఉన్న ఉపాధ్యాయుడిని మల్కన్‌గిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు.

ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్

ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు.. నిందితుడు నరేష్‌ను అరెస్ట్ చేశారు. నిరాకర్ మృతదేహన్ని పోస్టుమార్టం అనంతరం సోమవారం ఉదయం బాధిత కుటుంబ సభ్యులకు అప్పగించారు. నిరాకర్‌కు భార్య, ఓ కుమార్తె ఉన్నారు. అయితే మృతదేహన్ని ఉపాధ్యాయుడి స్వస్థలం బరంపురం తరలించాలంటే ఆర్థికంగా అంత స్థోమత లేదని బాధితులు వాపోయారు. తమ కుటుంబాన్ని ఆదుకోవాలని, నిరాకర్ కుటుంబ సభ్యులక్లో ఒకరికి ఉద్యోగం, రూ.10 లక్షల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. దీనిపై పోలీసులు కలుగజేసుకొని సర్ది చెప్పడంతో ధర్నా విరమించారు. అయితే ఈ హత్యోదంతంపై పాఠశాల సిబ్బంది స్పందించడం లేదు.

క్లుప్తంగా

ఏడుగురు జూదరుల అరెస్ట్

లక్కవరపుకోట: మండలంలోని మల్లివీడు గ్రామం శివారులో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఎస్సై ఎస్.ముకుందరావు సిబ్బందితో కలిసి సోమవారం దాడి చేశారు. ఈ సందర్భంగా జూదమాడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి దగ్గర రూ. 18,100 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బాధితులకు న్యాయం

● డీఎస్పీ మోహన్‌రావు

గుర్ల: ఏఆర్ బెనిఫిట్ సంక్రాంతి కానుక బాధితులందరికీ న్యాయం చేస్తామని డీఎస్పీ మోహన్‌రావు అన్నారు. గుర్ల పోలీస్‌స్టేషన్ వద్ద సోమవారం ఆందోళన చేస్తున్న బాధితులతో ఆయన మాట్లాడారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ బాధితులంతా తప్పనిసరిగా గుర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. మజ్జి అప్పలరాజు కోసం గాలిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు 25వేల మంది బాధితులు ఉన్నట్లు గుర్తించామన్నారు. బాధితులు ఏజెంట్లపై దాడులు చేస్తున్నారని ఫిర్యాదు వస్తున్నాయని, ఏజెంట్లపై దాడి చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కోర్టు ద్వారా బాధితులకు న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు.

జాతీయ స్థాయి ట్యాంగ్ సూడో పోటీలకు జిల్లా జట్టు



జాతీయ స్థాయి పోటీలకు పయనమైన జిల్లా జట్టు

కొత్తవలస: ఈ నెల 4వ తేదీ నుంచి ఢిల్లీలోని ఎల్.కె.ఇంటర్నేషనల్ స్టేడియంలో జరగనున్న జాతీయ స్థాయి ట్యాంగ్ సూడో కొరియన్ మార్షల్ ఆర్ట్స్ పోటీలకు జిల్లా జట్టు సోమవారం పయనమైంది. గత ఏడాది సెప్టెంబర్ నెలలో గుంటూరులో జరిగిన స్టేట్ మీట్‌లో ఎం.నికిత, ఎ.తేజస్విని, ఎస్.సౌమ్య, ఎ.సునీతలు జాతీయ పోటీలకు ఎంపికైనట్లు ఉత్తర కోస్తా ట్యాంగ్ సూడో స్పోర్ట్స్ అసోసియేషన్ చీఫ్ కోచ్ ఎం.ప్రకాశ రావు తెలిపారు.ఈ జట్టుకు మేనేజర్‌గా ఎం.దివ్య వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. జాతీయస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని పలువురు ఆకాంక్షించారు.

ఆర్చరీలో స్వర్ణ పతకం



స్వర్ణపతక విజేత కుమార్‌నాయుడును సన్మానిస్తున్న దృశ్యం

శృంగవరపుకోట: మండలంలోని డాక్టర్ వరలక్ష్మి వ్యాయామ కళాశాల విద్యార్థి అంతర్ విశ్వవిద్యాలయాల ఆర్చరీ పోటీల్లో స్వర్ణ పతకం సాధించాడు. తమ విద్యార్థి విజయం పట్ల కళాశాల యాజమాన్యం, బోధనా సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో స్వర్ణ పతకం సాధించిన విద్యార్థి ఐ.కృష్ణ సాయికిరణ్ కుమార్‌నాయుడును విద్యాసంస్థల యజమానులు డాక్టర్ వరలక్ష్మి, డాక్టర్ సిద్ధి సన్మానించి, రూ.5000లు నగదు ప్రోత్సాహకంగా అందచేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలే లక్ష్యం



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

విజయనగరం పూల్‌బాగ్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలే లక్ష్యంగా మేమంతా కలిసికట్టుగా పనిచేస్తున్నామని జిల్లా ప్రజా సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు పి.షణ్ముఖరావు స్పష్టం చేశారు. సోమవారం స్థానిక ప్రజా గ్రంథాలయంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ సమసమాజ స్థాపనకు కృషి చేశారన్నారు. ప్రజా సమస్యలే ప్రధాన అజెండాగా ప్రజా సంఘాల ఐక్యవేదిక పని చేస్తోందన్నారు. కరోనా సమయంలో సంచార జాతుల వారిని వారి గమ్యస్థానాలకు చేర్చడంతో పాటు జిల్లాలో మూతపడిన పరిశ్రమలు తెరిపించేందుకు కృషి చేశామన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు గొర్లె సూరిబాబు, టీవీ దుర్గారావు, మలిచర్ల దుర్గారావు, చోడి ఆదినారాయణ, గండి బోయిన భాస్కరరావు, కె. విశ్వనాథం పాల్గొన్నారు.

కళాకారులను ప్రోత్సహించడం అందరి బాధ్యత

బొబ్బిలి: ఆధ్యాత్మిక కళాకారులను ప్రోత్సహించడం మనందరి బాధ్యతని పలువురు వక్తలు అన్నారు. పట్టణంలోని తారకరామా కాలనీలో మహిళా కోలాటం కళాకారులకు స్థానిక ధర్మకర్త రెడ్డి సత్యం ఆధ్వర్యంలో సోమవారం చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామసేన సభ్యులు పెద్దాడ సంతోష్ కుమార్, రాజేష్, సాయిప్రసన్న, పలువురు కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మోక్షప్రదం..
వైకుంఠ ద్వార దర్శనం



భువనేశ్వర్: పూరీలో మార్కెట్ వీధి నుంచి శ్రీమందిరం సింహద్వారం వరకు భక్తుల కోసం ఏర్పాటు చేసిన షెడ్లు



పర్లాకిమిడి: రంగనాథుగా దర్శనమిస్తున్న వేంకటేశ్వర స్వామి

- భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి పూజలు
- భక్తులతో కిక్కిరిసిన వైష్ణవ ఆలయాలు

భువనేశ్వర్:

రాష్ట్రంలో వైష్ణవాలయాలు సోమవారం కళకళలాడాయి. ముక్కోటి ఏకాదశి పురస్కరించుకొని ఉత్తర ద్వారం గుండా స్వామివారిని దర్శించుకొనేందుకు వేకువజాము నుంచే భక్తులు పోటెత్తారు. భువనేశ్వర్, ఖుర్దారోడ్, జాజ్‌పూర్ తదతర ప్రాంతాల్లో వైకుంఠ ఏకాదశి ప్రత్యేక ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక తిరుమల తిరుపతి దేవస్థానం వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నుంచి ప్రత్యేక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఆలయం సలహామండలి సభ్యులు ఎల్.నారాయణ రావు, ఎస్.శాంతారామన్ పర్యవేక్షణలో పలు ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాలను మనోరంజకంగా నిర్వహించారు. భువనేశ్వర్, కటక్, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు ఈ కార్యక్రమాల్లో పాలుపంచుకోవడం విశేషం. సూపరింటెండెంట్ కె.సూర్యనారాయణ రెడ్డి పర్యవేక్షణలో భువనేశ్వర్ పార్లమెంట్ సభ్యురాలు అపరాజిత షడంగి స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే ఎస్.శ్రీనివాసరావు ఒడియా, హిందీ భజన గీతాలాపాన, దేవీ బృందం, విజయలక్ష్మి బృందం, శ్రీవల్లి బృందం కోలాటం, కె.కుసుమ బృందం అన్నమాచార్య సంకీర్తనాలాపన కార్యక్రమాల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన డాక్టర్ సోమయాజుల త్యాగరాజ శాస్త్రి(హైదరాబాద్) వెంకటేశ్వర స్వామి శతకం వివరణ ముక్కోటి విశేషంగా ఆకట్టుకుంది.



భువనేశ్వర్: ఖుర్దారోడ్ బాలాజీ మందిరంలో సంధ్యా హారతి

లక్ష తులసీ దళార్చన..

ఖుర్దారోడ్ అకౌంట్స్ కాలనీ బాలాజీ మందిరంలో వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని ప్రత్యేకంగా లక్ష తులసీ దళార్చన కార్యక్రమం నిర్వహించారు. దేవస్థానం కల్యాణ మండపం ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళలు భక్తి శ్రద్ధలతో పాలు పంచుకున్నారు. ధనుంజయాచార్యుల ఆధ్వర్యంలో ముక్కోటి ఏకాదశి ప్రత్యేక పూజాదులు నిర్వహించినట్లు నిర్వాహక సభ్యుడు టీవీఎస్ చౌదరి తెలిపారు. జాజ్‌పూర్ వైభవ వెంకటేశ్వర స్వామి వివిధ రకాల పండ్లతో అలంకరించుకుని భక్తులకు దర్శన భాగ్యం కల్పించడం విశేషం



రాయగడ: స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భాస్కరాచార్యులు



జయపురం: ఆలయ ప్రాంగణంలో భక్తులు

భక్తసంద్రం.. శ్రీక్షేత్రం

పూరీ జగన్నాథుని దర్శనం కోసం భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. ఆంగ్ల సంవత్సరాది, ముక్కోటి ఏకాదశి తిథి పురస్కరించుకుని భక్తులు తాకిడి పుంజుకుంది. రద్దీ నియంత్రణ కోసం మార్కెట్ వీధి నుంచి శ్రీమందిరం సింహద్వారం ఆవరణ వరకు షెడ్లు ఏర్పాటు చేశారు. సీనియర్ సిటిజన్ల విశ్రాంతి కోసం ప్రత్యేక షెడ్డును ఏర్పాటు చేశారు. మార్కెట్ వీధి నుంచి సింహద్వారం వైపు ద్విచక్ర, త్రిచక్ర, నాలుగు చక్రాల వాహనాలు, వాహనాల రవాణా నివారించారు.



భువనేశ్వర్: లక్ష తులసి దళార్చనలో పాల్గొన్న మహిళలు

జయపురంలో..

జయపురం: పట్టణంతో పాటు సబ్ డివిజన్ పరిధిలోని బొరిగుమ్మ, బొయిపరిగుడ, కొట్‌పాడ్ ప్రాంతాల్లోని ఆలయాలు భక్తులతో కిక్కిరిసాయి. జయపురంలోని ఆలయంలో అర్చకులు శ్రీనివాసాచారి, మంజునాథ్ ఆచారి శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. వైభవ వేంకటేశ్వర ఆలయ పరిపాలన కమిటీ అధ్యక్షుడు ఆరిశెట్టి రామకృష్ణ పర్యవేక్షణలో ఉత్తర ద్వార దర్శనం కల్పించారు.

లక్ష గులాబీలతో..

రాయగడ: పట్టణంలోని బాలాజీ నగర్ కల్యాణ వేంకటేశ్వర ఆలయంలో స్వామివారికి లక్ష గులాబీలతో పూజలు నిర్వహించారు. ప్రధానార్చకులు భాస్కర ఆచార్యులు, రాంజీ ఆచార్యుల ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, కుంకుమార్చన, అభిషేకాలు జరిపారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామివారిని ఉత్తర ద్వారం నుంచి భక్తులు దర్శించుకునే అవకాశాన్ని కల్పించారు.



రాయగడ: లక్ష గులాబీ పూజల్లో పాల్గొన్న మహిళలు

మలయప్ప వాహనంపై..

పర్లాకిమిడి: స్థానిక మున్సిపాలిటీ లోని కోమటి వీధిలో ఉన్న వేంకటేశ్వరాలయంలో స్వామివారు రంగనాథ స్వామిగా దర్శనమిచ్చారు. 130 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయాన్ని రాజమండ్రికి చెందిన పైడిఘంటం వారు నిర్మించారు. వారసులు రేజేటి వాణి వరప్రసాద్ ఆధ్వర్యంలో భద్ర చక్రధర్ రూపకల్పన చేసిన రంగనాథ స్వామి విగ్రహాన్ని అత్యంత సుందరంగా, శ్రీదేవి, భూదేవి సమేతంగా భక్తులకు దర్శనం కల్పించారు. ప్రధానార్చకులు భద్రం శ్రీనివాసాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి, మలయప్ప వాహనంపై స్వామివారికి తిరువీధి ఉత్సవం జరిపారు. పొట్నూరు హరి తీర్ధ ప్రసాదాలు అందజేయగా, బరాటం నాగేశ్వరరావు, కె.రమేష్, ఏ.అప్పారావు తదితరులు పూజల్లో పాల్గొన్నారు.



జయపురం: తలపై మొక్కులతో దర్శనానికి బారులుతీరిన భక్తులు



భువనేశ్వర్: టీటీడీ వెంకటేశ్వర ఆలయంలో మహిళా బృందాల కోలాటం



జయపురం: దీపారాధన చేస్తున్న మహిళలు

చౌయితి ఉత్సవాలకు సన్నాహాలు

రాయగడ: ఈనెల 18 నుంచి పట్టణంలోని గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో జరగనున్న చౌయితి ఉత్సవాలకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. జిల్లాలోని చంద్రపూర్ సమితి లోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం మీనాజోలలో చౌయితి ఉత్సవాలకు సంబంధించి పూజా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమశాఖ మంత్రి జగన్నాథ సరక, కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉలక, గుణుపూర్ ఎమ్మెల్యే రఘునాథ్ గొమాంగో, రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి, జిల్లా కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్, ఎస్పీ వివేకానంద శర్మ, జిల్లా అదనపు మేజిస్ట్రేట్ ధర్మానంద బెహరా, ఎస్‌డీసీ చైర్మన్ అనసూయ మాఝి, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, డీపీఆర్‌ఓ బసంతకుమార్ ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.



నదీ జలాలను తీసుకువస్తున్న ఏడీఎం బెహరా



హోమంలో మంత్రి సరక, ఎంపీ ఉలక, కలెక్టర్

తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ

బరంపురం: నూతన సంవత్సరం సందర్భంగా తెలుగు బ్రాహ్మణ సేవాసంఘం ఆధ్వర్యంలో నీలకంఠ నగర్, హౌసింగ్ బోర్డ్ స్టేజ్–1లో ఉన్న గాయత్రీదేవి మందిరంలో వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా 2023 తెలుగు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రోలాండ్ ఫార్మాసిటికల్ చైర్మన్ డాక్టర్ ప్రకాష్‌రావు, తెలుగు బ్రాహ్మణ సేవాసంఘం అధ్యక్షుడు పి.సత్యనారాయణ బాబు, పూజా కమిటీ చైర్మన్ ఎస్.రామ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు పాల్గొన్నారు. అలాగే లక్ష్మిగణపతి ఆలయంలో వైదిక సంఘం ఆధ్వర్యంలో 2023 నూతన క్యాలెండర్ ఆవిష్కరించారు.



లక్ష్మీ గణపతి ఆలయంలో 2023 తెలుగు క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

వేర్వేరు ప్రమాదాల్లో పలువురి మృతి

ముక్కోటి ఏకాదశి పర్వదినాన ఉమ్మడి జిల్లా ప్రజలు వైకుంఠ ద్వార దర్శనం చేసుకునేందుకు ఆలయాలకు పోటెత్తి ఆధ్యాత్మిక వాతావరణంలో గడపగా..మరికొన్ని కుటుంబాల్లో రోడ్డు ప్రమాదాలు తీవ్ర విషాదం నింపాయి. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో సోమవారం జరిగిన వేర్వేరు రోడ్డు, ఇతర ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు కోల్పోగా మరికొందరు గాయాల పాలై ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఆయా ప్రాంతాల్లో జరిగిన ప్రమాద సంఘటనలపై మృతుల కుటుంబసభ్యులు, పోలీసులు,. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

రెండు బైక్‌లు ఢీకొని ఒకరు...



జోగయ్య మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య లేఖామణి, కుటుంబసభ్యులు



ప్రమాద స్థలంలో తుళ్లిపోయి పడి ఉన్న శంకరరావు, సంతోష్‌కుమార్

రామభద్రపురం: మండలకేంద్రంలోని బొబ్బిలి వెళ్లే రహదారిలో గల గ్లోబల్ వ్యూ స్కూల్ వద్ద రెండు బైక్‌లు ఢీ కొనడంతో ఓ వ్యక్తి మృతి చెందగా మరో ఇద్దరు గాయపడ్డారు. సోమవారం జరిగిన ఈ ప్రమాదంపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బాడంగి మండలం కోడూరు గ్రామానికి చెందిన పాగిరి జోగయ్య(37) స్థానిక గ్లోబల్ వ్యూ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్నాడు. రోజులాగానే స్కూల్‌కు సోమవారం ఉదయం హాజరైన ఆయన ఇంటి తాళాలు, డబ్బులు తన వద్ద ఉండిపోవడంతో స్కూల్ నుంచి మళ్లీ ఇంటికి వెళ్లాడు. భార్య చేతికి వాటిని ఇచ్చి ద్విచక్రవాహనంపై తిరిగి స్కూల్‌కు వస్తుండగా దత్తిరాజేరు మండలం వంగర గ్రామానికి చెందిన బొర్ల సంతోష్‌కుమార్, మరడ శంకరరావులు రాయగడ నుంచి ద్విచక్రవాహనం (బుల్లెట్)పై వస్తూ జోగయ్య వాహనాన్ని బలంగా ఢీకొట్టారు. దీంతో జోగయ్యతో పాటు వారిద్దరూ రోడ్డుపై తుళ్లి పడిపోయారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న ఎస్సై సురేంద్రనాయుడు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జోగయ్యను తన పోలీసు జీపులో బాడంగి సీహెచ్‌సీకి తీసుకువెళ్లారు. స్వల్ప గాయాలైన శంకరరావు, సంతోష్‌కుమార్‌లను ఆటోలో రామభద్రపురం పీహెచ్‌సీకి తరలించారు. తీవ్రంగా గాయపడిన జోగయ్య బాడంగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతునికి భార్య లేఖామణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని భార్య గజరాయుని వలస సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిస్తోంది. తనకు తాళాలు ఇచ్చి వెళ్లిన క్షణంలోనే అనంతలోకాలకు వెళ్లిపోయిన భర్త మృతదేహాన్ని చూసి ఆమె భోరున విలపించింది. ఎస్సై సురేంద్రనాయుడు ప్రమాద ఘటనపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని మహిళ..



లారీ టైర్లలో ఇరుక్కుపోయిన గౌరమ్మ మృతదేహం

పార్వతీపురం: పట్టణంలోని పాత బస్‌స్టాండ్ సమీపంలో సోమవారం ఛత్తీస్‌గఢ్ వెళ్తున్న లారీ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా పట్టణానికి చెందిన గౌరమ్మ(52)ను బలంగా ఢీకొట్టడంతో టైర్ల కింద ఆమె ఇరుక్కుని ప్రాణాలు కోల్పోయింది. ఈ మేరకు మృతురాలి మేనల్లుడు ఉపేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కృష్ణమూర్తి తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించి డ్రైవర్‌ను, లారీని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు.

క్వారీ ప్రమాదంలో వ్యక్తి..

భోగాపురం: మండలంలోని రామచంద్రపేట గ్రామం సమీపంలో ఉన్న క్వారీలో సోమవారం జరిగిన ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా మరొకరు గాయాలతో బయటపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. రామచంద్రపేట క్వారీలో రెండు రోజుల క్రితం ఏర్పాటు చేసిన బాంబు అనుకోకుండా పేలడంతో గ్రామానికి చెందిన కొయ్య గోవింద్(30) క్వారీలో డ్రిల్లింగ్ పనులు చేస్తూ అక్కడికక్కడే మృతిచెందగా, అదే గ్రామానికి చెందిన కోటపల్లి బుల్లోడు తీవ్ర గాయాలతో బయటపడ్డాడు. గాయాలతో ఉన్న వ్యక్తిని విజయనగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి బంగారమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా పడి యువకుడు..



మృతిచెందిన ఒడిశా యువకుడు నబిజాతర్ నాయక్

కొమరాడ: మండలంలోని గుణానుపురం గ్రామంలో ఇటుకలు తయారీ చేస్తున్న బట్టీ వద్ద సోమవారం ఒడిశా రాష్ట్రానికి చెందిన యువకుడు నబిజాతర్ నాయక్(19) మృతి చెందాడు. స్థానికులు, ఎస్సై తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రంలోని గుణుపూర్ సమితి ఉక్రంబ్ గ్రామానికి చెందిన యువకుడు ఇటుక తయారీ పని కోసం వచ్చి మట్టిని ట్రాక్టర్‌తో తొక్కిస్తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడడంతో కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటనపై ఎస్సై జగదీష్ నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టు నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించారు..

లారీ, బైక్ ఢీకొని మరొకరు..



రాజేష్‌కుమార్ (ఫైల్)

మెరకముడిదాం: మండలంలోని గర్భాం ఇండియన్ ఆయిల్ పెట్రోల్‌బంక్ ఎదురుగా లారీ, బైక్ ఢీకొన్న సంఘటనలో ఓ యువకుడు మృతిచెందాడు. వివరాలిలా వున్నాయి. మెరకముడిదాం గ్రామానికి చెందిన మురహరిరావు రాజేష్‌కుమార్ (32) మెరకముడిదాం నుంచి గరివిడి బైక్‌పై వెళ్తుండగా గర్భాం ఇండియన్ ఆయిల్ పెట్రోల్‌బంక్ దగ్గర మలుపు వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో రాజేష్‌కుమార్ తలకు హెల్మెట్ ఉన్నప్పటికీ తీవ్రమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రాజేష్ బంధువులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రాజేష్ తండ్రి ఏడాది క్రితం కరోనాతో మృతిచెందారు. ఇప్పుడు రాజేష్ ఇలా మృతిచెందడంతో కుటుంబసభ్యులు, బంధువులు భోరున విలపించారు. విషయం తెలుసుకున్న బుదరాయవలస ఎస్సై సీహెచ్.నవీన్‌పడాల్ సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం చీపురుపల్లి సీహెచ్‌సీకి తరలించి కేసునమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

జీపు బోల్తా పడి ఇద్దరు గిరిజనులు..



మృతి చెందిన హరికృష్ణ



సంఘటన స్థలంలో చంద్రమ్మ మృతదేహం

కొమరాడ: మండలంలోని సరుగుడు గూడ–జాకురు గ్రామాల మధ్య ఘాట్‌రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గిరిజనులు మృతిచెందారు. సోమవారం జరిగిన ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. మండలంలోని గుడ్డాం గ్రామం నుంచి పార్వతీపురం జిల్లా కేంద్రానికి జొన్న గింజలు, ధాన్యంతో బయల్దేరిన జీపులో ప్రయాణికులు హిమరిక హరి కృష్ణ (29) భార్య జయశ్రీ, ఇద్దరు పిల్లలు, కోలక చంద్రమ్మ (62) ఉన్నారు. అయితే అకస్మాత్తుగా అదుపుతప్పి జీపు బోల్తా పడడంతో సంఘటనా స్థలంలోనే చంద్రమ్మ మృతి చెందగా గాయాల పాలైన హరికృష్ణను పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై జగదీష్‌నాయుడు సంఘటన స్థలంలో పరిశీలించి కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

న్యూస్‌రీల్

నేడు సిక్కోలు డ్వాక్రా బజార్ ప్రారంభం

శ్రీకాకుళం పాతబస్టాండ్: శ్రీకాకుళంలో మంగళవారం సిక్కోలు డ్వాక్రా బజారు ప్రారంభిస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు డాక్టర్ డీవీ విద్యా సాగర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఏడు రోడ్ల కూడలి వద్ద గల నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల మైదానంలో 2023 జనవరి 3 నుంచి 9 వరకు ప్రతి రోజూ ఉదయం 10 నుంచి రాత్రి 9.30గంటల వరకు డ్వాక్రా బజారు తెరచి ఉంటుందని పేర్కొన్నారు. ఈ బజారులో స్వయం సహాయక బృందాలు తయారు చేసిన వివిధ వస్తువులను ప్రదర్శించడంతో పాటు విక్రయించనున్నట్లు ఆయన ఆ ప్రకటనలో వివరించారు.

నేడు వర్సిటీలో ఖాళీ పీజీ సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పీజీ కోర్సుల్లో ఖాళీ సీట్లకు మంగళవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ సీహెచ్‌ఏ రాజేంద్రప్రసాద్ చెప్పారు. విశ్వవిద్యాలయంలో సోమవారం వివరాలు వెల్లడించారు. కోర్సుల వారీగా ఖాళీ సీట్లకు ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు. ఏపీ స్టేట్ పీజీ సెట్-2022 ఉత్తీర్ణత సాధించిన వారు మాత్రమే స్పాట్ అడ్మిషన్లకు అర్హులని వివరించారు. సైన్స్, ఆర్ట్స్ కళాశాలల్లో ఉదయం 10 గంటలకు విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు, పాస్ పోర్టు సైజ్ ఫొటోలతో హాజరు కావాలని తెలిపారు.

వలస మత్స్యకారుడు మృతి


మృతుడు తోటయ్య (ఫైల్)

ఎచ్చెర్ల: మండలంలోని బుడగట్లపాలేం గ్రామానికి చెందిన మత్స్యకారుడు కారి తోటయ్య (44) కర్నాటక రాష్ట్రం మంగుళూరులో సముద్రంలో మునిగి చనిపోయాడు. ఈయన పొట్టకూటి కోసం కర్నాటక మంగళూరు ప్రాంతానికి వలస వెళ్లాడు. గత నెల 30న సముద్రంలోకి వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు సంద్రంలో పడిపోయాడని స్థానికులు చెబుతున్నారు. ఈయన మృతదేహం సోమవారం లభ్యం కావటంతో ఈయన భార్య సూర్యకుమారికి సమాచారం అందించారు. దీంతో కుటుంబ సభ్యులతో పాటు మాజీ సర్పంచ్ అంబటి రాంబాబు, మద్దు లక్ష్మణరావులు వెళ్లి మృతదేహానికి పోస్టుమార్టం చేయించారు. మృతునికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని కుటంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానిక నాయుకులు కోరుతున్నారు.

ఆటో ఢీ కొని వ్యక్తి మృతి


నౌపడ సత్యనారాయణ మూర్తి మృతదేహం

కోటబొమ్మాళి: స్థానిక మెయిన్ రోడ్డులోని స్టేట్ బ్యాంకు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కోటబొమ్మాళి విలేకరుల కాలనీకి చెందిన నౌపడ సత్యనారాయణమూర్తి(50)మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు సోమవారం సాయంత్రం సత్యనారాయణమూర్తి ఏటీఎంకు వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా కోటబొమ్మాళి వైపు నుంచి కొత్తపేట వైపు వెళ్తున్న ఆటో ఢీకొట్టింది. దీంతో ఆయన తలకు, శరీరంపై బలమైన దెబ్బలు తగిలాయి. స్థానికులు 108 వాహనంలో స్థానిక ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. ఈయన గతంలో పత్రికా విలేకరిగా పనిచేశారు. మృతునికి భార్య బాలసోమేశ్వరి, కుమార్తె తనుశ్రీ ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్‌ఐ నాగభూషణరావు తెలిపారు.

డిగ్రీ మూల్యాంకనం ప్రారంభం

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాలలో డిగ్రీ స్పాట్ వాల్యుయేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల 4వ సెమిస్టర్ రెగ్యులర్, 2వ సెమిస్టర్ సప్లిమెంటరీ స్పాట్ వాల్యుయేషన్ ప్రక్రియ సోమవారం మొదలైంది. మ్యాథ్స్, కెమిస్ట్రీ, ఫిజిక్స్, కామర్స్, బోటనీ, జువాలజీ, హిస్టరీ, పాలిటిక్స్, ఎకనామిక్స్, కంప్యూటర్‌సైన్స్, స్పెషల్ తెలుగు, స్పెషల్ ఇంగ్లిష్ తదితర పేపర్లకు సంబంధించిన దిద్దుబాటు ప్రక్రియను ప్రారంభించినట్టు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కణితి శ్రీరాములు తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు దిద్దుబాటు జరుగుతుందనని, అర్హత కలిగిన ఎగ్జామినర్లంతా తప్పనిసరిగా రిపోర్ట్ చేయాలని ఆయన సూచించారు.

గౌరిబెత్తి.. పరిగెత్తించింది



కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ అంబుసోలి చెరువు వద్ద గౌరిబెత్తి అని పిలిచే విష సర్పం అలజడి సృష్టించింది. చెరువులో వేసిన చేపల వలకు చిక్కుకున్న పామును చూసి చేపలు పట్టేవారంతా భయపడ్డారు. అటవీ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి పామును పట్టుకున్నారు.


మందస: శ్రీవాసుదేవ పెరుమాళ్‌స్వామి సన్నిధిలో ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న మహిళలు


గార: గరుడ వాహనంపై ఊరేగింపునకు వెళ్తున్న శ్రీకూర్మనాథుడు


అరసవల్లిలో ఉత్సవమూర్తులను తీసుకొస్తున్న అర్చకులు

● గోవిందాశ్రిత..

ముక్కోటి ఏకాదశి పర్వదినాన వైకుంఠ ద్వార దర్శనానికి భక్తకోటి పోటీ పడింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న వైష్ణవ క్షేత్రాలు సోమవారం కళకళలాడాయి. ఉత్తర ద్వార దర్శనాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో వేకువజాము నుంచే భక్తులు బారులు తీరారు. స్వామి దర్శనాలతో పులకించిపోయారు. పవిత్ర ఏకాదశి నాడు అన్ని ఆలయాల్లో స్వామి మూర్తులను అందంగా అలంకరించారు.



అరసవల్లిలో ఉత్తరద్వారం ద్వారా స్వామిదర్శనానికి వెళ్తున్న భక్తులు


శ్రీకాకుళం పీఎన్ కాలనీలోని నారాయణ తిరుమలలో భక్తురాలు


అరసవల్లి: ఉత్తర ద్వారం వద్ద భక్తుల రద్దీ


శ్రీకాకుళం పీఎన్ కాలనీలోని నారాయణ తిరుమలలో గరుడవాహనం

జాతీయ వాలీబాల్ పోటీలకు ముగ్గురు ఎంపిక


అప్పలనాయుడు


భానుప్రసాద్


శ్రావణి



శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ వాలీబాల్ పోటీలకు జిల్లా నుంచి ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారు. దేశ రాజధాని ఢిల్లీ వేదికగా ఈనెల 3 నుంచి 8వ తేదీ వరకు ఆలిండియా సబ్‌జూనియర్స్ బాలబాలికల వాలీబాల్ చాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు జిల్లా నుంచి బాలురు విభాగంలో వండాన అప్పలనాయుడు(కోటపాలెం), ముడిరాన భానుప్రసాద్ (రామకృష్ణాపురం), బాలికల విభాగంలో బి.శ్రావణి (లోపెంట) ఎంపికయ్యారు. వీరు ముగ్గురు ఆంధ్రప్రదేశ్ బాలబాలికల జట్లకు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఇప్పటికే వీరు రాష్ట్రవాలీబాల్ బృందంతో కలిసి ఢిల్లీ చేరుకున్నారు. వీరి ఎంపికపై శ్రీకాకుళం జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, ప్రధాన కార్యదర్శి యాళ్ల పోలినాయుడు, పి.సుందరరావు, కార్యనిర్వాహక కార్యదర్శి కె.రామచంద్రుడు, కోశాధికారి టి.రవి, పీఈటీ సంఘ నాయకులు ఎంవీ రమణ, ఎం.సాంబమూర్తి, డీఎస్‌ఏ చీఫ్ కోచ్ ఎం.మాధురీలత, వాలీబాల్ కోచ్ కె.హరికృష్ణ, సంఘ ప్రతినిధులు, సీనియర్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

మేకల కొనుగోలుకు రూ.కోటి మంజూరు


మంజూరైన పత్రాన్ని అందిస్తున్న ఈడీ డాక్టర్ సూర్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మేకలు, గొర్రెల కొనుగోలుకు భారత్ లైవ్‌స్టాక్ మిషన్ ద్వారా నిధులు మంజూరు చేస్తున్నట్లు శ్రీకాకుళం, మన్యం, విజయనగర జిల్లాల పశుసంవర్ధక శాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.సూర్యం తెలిపారు. ఈ అవకాశాన్ని గొర్రెలు, మేకలు కావాల్సిన వారంతా వినియోగించుకోవాలని కోరారు. దీనిలో భాగంగా కోటబొమ్మాళి మండలం కురుడు గ్రామానికి చెందిన పొన్నాన మోహనరావుకి మేకల యూనిట్ విలువ రూ.కోటికి గాను ప్రభుత్వం నుంచి రాయితీగా రూ.50లక్షలు ఇచ్చినట్లు ఆ మంజూరు పత్రాన్ని సోమవారం లబ్ధిదారునికి అందించారు. ఆయన మాట్లాడుతూ యూనిట్‌లో 500 ఆడమేకలు, 25 మగ మేకలు కొనుగోలు చేసేందుకు ఈ నిధులు వినియోగించాలన్నారు. ఈ లోన్ మొత్తాన్ని 5 ఏళ్ల కాల పరిమితిలో తిరిగి తీర్చాల్సి ఉంటుందన్నారు. కొనుగోలు చేసిన మేకలకు ఎలాంటి ప్రాణాపాయం జరిగినా అందుకు బీమా కూడా ఉంటుందని తెలిపారు. నాణ్యమైన ఉత్పత్తులు పెంచడానికి భారతదేశం లైవ్‌స్టాక్ మిషన్ ద్వారా దేశంలో అన్ని రాష్ట్రాల్లో కూడా ఈ కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. యూనిట్‌లు కావాల్సిన వారు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సూర్యం (9440429628)కు సంప్రదించాలన్నారు.

ఆకట్టుకున్న అన్నమయ్య గీతాలు


అన్నమయ్య గీతాలాపన చేస్తున్న లక్ష్మి బృందం

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం నగరంలోని చిన్నబజారులో ఉన్న దూదివారి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా సోమవారం సాయంత్రం జరిగిన అన్నమయ్య భక్తి గీతాలాపన చక్కగా ఆకట్టుకుంది. షిర్డీసాయి సంగీత విద్యాలయం నిర్వాహకురాలు మల్లెమొగ్గల లక్ష్మి ఆధ్వర్యంలో పలు అన్నమయ్య కీర్తనలను వీనుల విందుగా గానం చేశారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని వీక్షించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

ఏఆర్ కానిస్టేబుల్ మృతి


చుక్కారావు (ఫైల్)


రామకృష్ణ కుటుంబానికి సాయాన్ని అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని ఆర్మ్‌డు రిజర్వు కార్యాలయంలో పనిచేస్తున్న కానిస్టేబుల్ గురుగుబెల్లి చుక్కారావు (50) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఈయనిది ఎచ్చెర్ల మండలం కొత్తపేట గ్రామం కాగా తోటపాలెం పంచాయతీ తవిటయ్యనగర్‌లో నివసిస్తున్నారు.

ఆర్థిక సహాయం అందజేత

చుక్కారావు మృతిపై పోలీస్ అసోసియేషన్ ప్రతినిధులు సంతాపం తెలియజేశారు. అసోసియేషన్ తరఫున అతని భార్య భాగ్యలక్ష్మికి లక్ష రూపాయల ఆర్థిక సాయాన్ని అందజేశారు. అలాగే రణస్థలం పోలీసు స్టేషన్‌లో పని చేస్తూ ఇటీవల చనిపోయిన హెడ్‌కానిస్టేబుల్ కేవీ రామకృష్ణకు కూడా అసోసియేషన్ ఆర్థిక సాయాన్ని ప్రకటించింది. ఎచ్చెర్లలో ఉంటున్న అతని భార్య సుధాదేవికి లక్ష రూపాయలను సంఘ నాయకులు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో ఎస్సై సత్యనారాయణ, అసోసియేషన్ ప్రతినిధులు రాధాకృష్ణ, కృష్ణంనాయుడు, భుజంగరావు పాల్గొన్నారు.

కేసుల ఛేదనే లక్ష్యంగా..

- చక్కటి పనితీరు కనబర్చుతున్న టూటౌన్ సీఐ ఈశ్వరప్రసాద్
- పలు అవార్డులు సొంతం

సాక్షి ఇంటర్వ్యూ


జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక నుంచి బెస్ట్ ఫైరింగ్ అవార్డు అందుకుంటున్న సీఐ ఈశ్వరప్రసాద్

శ్రీకాకుళం క్రైమ్: రిస్క్ ఎక్కడఉంటే అక్కడ ఉంటారు.. హైరిస్క్ ఉంటే మరింత అటెన్షన్ అవుతారు.. ఏవోబీ గ్రేహౌండ్స్, ఏహెటీయూ యాంటీ ఆపరేషన్‌లో చురుకైన పాత్ర పోషించారు. పోలీస్ బెటాలియన్ తరఫున స్టేట్, నేషనల్ స్పోర్ట్స్ అవార్డులు తన ఖాతాల్లో వేసుకున్నారు. ఆయనే శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీఐ ఆర్‌ఈ సీహెచ్ ఈశ్వరప్రసాద్. ఆయన సాధించిన విజయాలు.. ఛేదించిన కేసులను 'సాక్షి'తో పంచుకున్నారు. సోమవారమే ఆయనకు ఇచ్ఛాపురం బదిలీ అయ్యింది.

సాక్షి : విధుల్లో ఎప్పుడు చేరారు. ఇక్కడకు సీఐగా ఎప్పుడు వచ్చారు?

సీఐ: 2002లో విజయనగరం పోలీస్ బెటాలియన్‌లో ఏపీఎస్‌పీ ఎస్‌ఐగా విధుల్లో చేరాను. 2004 నుంచి 2011 వరకు ఏవోబీ గ్రేహౌండ్స్‌లో ఎస్సైగా యలమంచిలి, నర్సీపట్నం రూరల్, అరకులో పని చేశా. 2012-13లో పెందుర్తి క్రైమ్ ఎస్సైగా, 2013-17 ఆనందపురం సివిల్ ఎస్సైగా బాధ్యతలు నిర్వహించాను. 2017 మార్చిలో ఆనందపురంలో ఉద్యోగోన్నతి వచ్చి సీఐ అయ్యాను. 2017 ఆగస్టు నుంచి 2020 వరకు విజయనగరం మహిళా పోలీస్‌స్టేషన్‌లో సీఐగా సేవలందించాను. 2020 జూన్‌లో శ్రీకాకుళం టూటౌన్ సీఐగా బాధ్యతలు స్వీకరించాను.

మీ పరిధిలో ఎంత మంది పనిచేస్తున్నారు?

మొత్తం 56 మంది సిబ్బంది ఉన్నారు. వీరిలో ఇద్దరు ఎస్సైలు, నలుగురు ఏఎస్సైలు, ఎనిమిది మంది హెచ్‌సీలు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు ఉన్నారు.

వృత్తిలో మీకు సవాల్‌గా నిలిచిన సంఘటనలు..బాధించిన సందర్భాలు?

2009 జూన్‌లో బలిమెల ఘటనలో 38 మంది ఏవోబీ గ్రేహౌండ్స్ కమాండోలను మావోయిస్టులు పొట్టనపెట్టుకున్న ఘటన తీవ్రంగా బాధించింది. ఏపీఎస్‌పీ ఎస్సైగా ఉన్న సమయంలో గ్రేహౌండ్స్ విభాగంలో చేరి మల్కన్‌గిరి జంత్రిలో, ఒడిశా చిత్రకొండ వద్ద 24 మంది మావోల ఎన్‌కౌంటర్‌లో సభ్యునిగా పాల్గొన్నాను. 2017 -2020 విజయనగరం మహిళా పోలీస్‌స్టేషన్ సీఐగా ఉన్నప్పుడు మైనర్‌బాలికను ఢిల్లీ వ్యభిచార కుంపటిలోకి నెట్టిన 14 మందిని ఏహెచ్‌టీయూ యాంటీ ఆపరేషన్ చేసి పట్టుకున్నాం. బాలికను రక్షించాం.

టూటౌన్‌లో మీకు గుర్తుండిపోయే కేసుల ఛేదనలు?

2021లో ఆదిత్యనగర్ హత్యకేసులో ఆరుగురు నిందితులను పట్టుకున్నాం. 2022 మేలో స్థానిక సౌత్‌ఇండియా షాపింగ్ మాల్ దరిలో జరిగిన బంగారం చోరీకేసులో ఒడిశాకు చెందిన ఇరానీ గ్యాంగ్‌ను తమ టీమ్‌తో ఒడిశాలోని కరియా, జాజిపూర్ వెళ్లి రిస్క్ చేసి నిందితులను పట్టుకున్నాం. గత ఏడాది ఆగస్టులో కిమ్స్ డైరెక్టర్, ప్రముఖ వైద్యుడు గూడేన సోమేశ్వరరావును కిడ్నాప్ చేసేందుకు యత్నించిన కేసులో తక్కువ సమయంలో ఎనిమిది మంది నిందితులను పట్టుకుని కేసును ఛేదించాం. ఆరు బైక్‌ల చోరీ నిందితులను, ఒక గంజాయి కేసు నిందితులను పట్టుకున్నాం.

సైబర్ నేరాలు ఎలాంటివి?

మనీ ట్రాంజెక్షన్స్ పట్ల జాగ్రత్త వహించాలి. ఫేక్ యాప్స్, కాల్స్‌కు స్పందించకూడదు. ఉదాహరణకు మీషో ఆన్‌లైన్ షాపింగ్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో మీ ఇంటి చిరునామాకు లెటర్స్ వస్తాయి. అందులో మొదటి బహుమతి అని ఉన్నవద్ద స్క్రాచ్ చేయండి అని ఉంటుంది. అలాంటి వాటికి దూరంగా ఉండాలి.

మీ సేవలకు వచ్చిన అవార్డులు..రివార్డులు?


మైనర్ బాలికను కాపాడిన ఏహెచ్‌టీయూ యాంటీ ఆపరేషన్‌లో ఉన్నందుకు 2019లో అప్పటి సీఐడీ డీజీపీ పి.వి.సునీల్ కుమార్ (ప్రస్తుతం డీజీపీ) చేతుల మీదుగా డస్క్ అవార్డు, జిల్లా ఎస్పీ జి.ఆర్. రాధిక నుంచి 2021, 2022లో వరుసగా రెండుసార్లు ఫైరింగ్‌లో జిల్లా ఫస్ట్ రివార్డు, విజయనగరం పోలీస్ బెటాలియన్, ఏవోబీ గ్రేహౌండ్స్ తరఫున స్పోర్ట్స్‌లో నేషనల్, స్టేట్ అవార్డులు అందుకున్నా.

జలాశయం నిండేలా..

జనాశయం నెరవేరేలా

- వంశధార లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు టెండర్లు ఖరారు
- పోటీపడిన మూడు సంస్థలు
- రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు దక్కిన వర్క్
- గొట్టా బ్యారేజీ ఎగువన లిఫ్ట్ ఏర్పాటు
- 2.5కిలోమీటర్ల దూరంలో హిరమండలం రిజర్వాయర్‌కు వంశ'ధార' ఎత్తిపోత





సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: వంశధార జలాశయం నిండేలా.. పరివాహక ప్రాంత జనుల ఆశయం నెరవేరేలా మరో ముందడుగు పడింది. హిరమండలంలోని వంశధార జలాశయం నిండాలంటే ఎక్కడో ఎగువన నేరడి వద్ద బ్యారేజీ కట్టాలి. కానీ, దానికి ఒడిశా నుంచి అడ్డంకులు ఉన్నాయి. ఇవన్నీ తొలగి, నిర్మాణాలు జరిగితేనే గాని పచ్చని పొలాలకు నీరందదు. అంతవరకు పొలాలన్నీ ఎదురు చూడాలి. ఈ నిరీక్షణకు తెర దించుతూ ప్రభుత్వం కొత్త ఆలోచన చేసింది. గొట్టా బ్యారేజీ వద్ద నీటిని ఎత్తిపోసి రిజర్వాయర్‌కు పంపిస్తే వరద నీరు సముద్రం పాలు కాకుండా సంరక్షించే కార్యక్రమానికి నడుంబిగించింది. రూ.176కోట్లకు పైగా ఖర్చుతో ఏకంగా ఎత్తిపోతల పథకాన్ని నిర్మించబోతోంది. ఈమేరకు టెండర్లు ఖరారయ్యాయి. హైదరాబాద్‌కు చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ సంస్థ దక్కించుకుంది. దీంతో పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి.

అన్నీ ఉన్నా అందని వంశ'ధార'..

సిక్కోలు పొలాలు మూడు కాలాలూ పచ్చగా ఉండాలంటే వంశ'ధారే' ఆధారం. దాదాపు 2.50లక్షల హెక్టార్లు ఖరీఫ్, రబీల్లో పంటలతో కళకళలాడాలంటే వంశధార జలాలు అందాలి. దాని కోసం మహానేత వైఎస్సార్ హయాంలో భగీరథయత్నమే జరిగింది.

- వంశధార స్టేజ్ 2లో ఫేజ్ 2 పనులు చేపట్టారు.
- 87,88 ప్యాకేజీ పనులు దాదాపు 90శాతం పూర్తయ్యాయి.
- 19.5టీఎంసీల సామర్థ్యంతో హిరమండలం రిజర్వాయర్ కూడా సిద్ధమైంది.
- కానీ ఒడిశా పరిధిలో నేరడి వద్ద ఆనకట్ట కడితే తప్ప నీరు ప్రవహించదు. ప్రస్తుతం సైడ్ వియర్ ద్వారా రిజర్వాయర్‌కు నీరు మళ్లిస్తున్నా అది సరిపోవడం లేదు.
- వరద కాలువ ద్వారా 3నుంచి 5టీఎంసీల నీరు మాత్రమే వస్తోంది. దీంతో వంశధార ప్రాజెక్టు ఉన్న రైతులకు మేలు జరగడం లేదు.

లిఫ్ట్‌తో పరిష్కారం..

జిల్లాలో అత్యధిక ఆయకట్టులో మూడు పంటలు పండాలంటే మండు వేసవిలో వంశధార కాలువ నిండుగా ప్రవహించాలి. హిరమండలంలోని వంశధార రిజర్వాయర్‌కు 19.5 టీఎంసీల నీరు వచ్చి చేరాలి. ఇప్పుడా పరిస్థితి లేదు. ఖరీఫ్‌లోనే పూర్తి స్థాయి ఆయకట్టుకు నీరందడం లేదు. ఇక రబీ కోసమైతే చెప్పనక్కర్లేదు.

- 19.5 టీఎంసీల నీటిని తీసుకొస్తే మూడు పంటల సాకారం నెరవేరుతుంది.
- ప్రస్తుతం హిరమండలం రిజర్వాయర్‌లో డెడ్ స్టోరేజ్ కింద 2.5టీఎంసీల నీరు ఉంటుంది.
- ఫ్లడ్‌ఫ్లో కెనాల్, కొండ చరియల నుంచి వచ్చే నీరు మరో 4టీఎంసీలు ఉంటుంది.
- మిగతాది నింపాలంటే ఒకటి నేరడి బ్యారేజీ నిర్మాణం పూర్తి చేసి నదిలో నీటిని మళ్లించడం, లేదంటే గొట్టా బ్యారేజీ వద్ద లిఫ్ట్ ఏర్పాటు చేయడమే మార్గం. అయితే, నేరడి బ్యారేజీ నిర్మాణానికి ఉన్న అడ్డంకులు కారణంగా ఈ లోపు మొత్తం ఆయకట్టును సస్యశ్యామలం చేయాలంటే లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ తప్పనిసరి. ఇప్పుడదే ఆలోచనతో ప్రభుత్వం చొరవ తీసుకుంది. ఈ కల నెరవేర్చేందుకు అడుగులు వేస్తోంది.
- గొట్టా బ్యారేజీ ఎగువన కోరాడ గ్రామం వద్ద ఎత్తిపోతల పథకం నిర్మించి సుమారు 100రోజుల కాలంలో 16గంటల పాటు పంపింగ్‌తో 2.5కిలోమీటర్ల దూరంలో ఉన్న హిరమండలం రిజర్వాయర్‌కు 12టీఎంసీలకు పైగా నీటిని లిఫ్ట్ చేయనున్నారు. దాని వల్ల ఖరీఫ్, రబీలో మొత్తం ఆయకట్టుకు నీరందనుంది.

రూ.140.16 కోట్లకు కాంట్రాక్ట్ దక్కించుకున్న రాఘవ కన్‌స్ట్రక్షన్స్

వంశధార లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం టెండర్లు పిలిచింది. మూడు ప్రధాన సంస్థలు పాల్గొన్నాయి. మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్స్, కావేరీ ఇంజినీరింగ్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, రాఘవ కన్‌స్ట్రక్షన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు వర్క్ కోసం పోటీ పడ్డాయి. వీటిలో తక్కువ కోట్ చేసిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ టెండర్ దక్కించుంది. ఎస్టిమేటెడ్ కాస్ట్ వాల్యూ రూ.135కోట్ల 85లక్షల 339గా ప్రభుత్వం నిర్దేశించగా, దానికి 3.69శాతం యాక్సెస్‌తో రూ. 140కోట్ల 16లక్షల 69వేల 425కు కోట్ చేసి, టెండర్లలో పాల్గొన్న సంస్థలో తక్కువ కోట్ చేసిన సంస్థగా నిలిచి వర్క్ కైవసం చేసుకుంది. ఇప్పటికే అన్నీ ఒప్పందాలు జరిగిపోయాయి. త్వరలోనే పనులకు శంకుస్థాపన జరగనుంది.

వచ్చే ఖరీఫ్‌కు నీరిస్తాం



నేరడి బ్యారేజీ నిర్మాణానికి ఒడిశా నుంచి అభ్యంతరాలు ఉండడంతో కొంతకాలం పాటు జాప్యం జరిగే అవకాశం ఉంది. అందుకు ప్రత్యామ్నాయంగా హిరమండలం గొట్టా బ్యారేజీ వద్ద లిఫ్ట్ ఏర్పాటు చేసి రిజర్వాయర్‌లో 19 టీఎంసీల నీటిని నింపి జిల్లా రైతులకు రెండు పంటలకు నీరిచ్చేందుకు కృషి చేస్తున్నాం. పూర్తి స్థాయిలో ఈ ప్రాజెక్టును అందుబాటులోకి తీసుకోచ్చేందుకు రూ.176.30 కోట్లుతో పనులు చేపట్టి రానున్న ఖరీఫ్ నాటికే నీరిచ్చేందుకు ప్రయత్నం చేస్తాం. జిల్లా రైతులకు ఇదో వరంలా మారుతుంది. – **డోల తిరుమలరావు, ఎస్ఈ, బీఆర్ఆర్ వంశధార ప్రాజెక్టు, శ్రీకాకుళం.**